సాక్షి
జనగామ
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



డేంజర్.. డేంజర్

జిల్లాలో రైల్వే ట్రాక్‌ల పక్కనే నీరు రోజుల తరబడి నిలిచి ప్రమాదకరంగా తయారైంది. అధికారులు దృష్టి సారించడం లేదు. - 8లో▸



నాలుగు గంటలు.. నరకయాతన

ఈదుల పూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో కొట్టుకుపోయిన వారు నాలుగు గంటల పాటు నరకయాతన అనుభవించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31°/23°

ఆకాశం అధిక శాతం మేఘావృతమై ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి.

వానొస్తే రవాణా బంద్

- కొట్టుకుపోయిన కల్వర్టులు.. తెగిన తాత్కాలిక రహదారులు
- పొంగి పొర్లుతున్న వాగులు.. దాటే ప్రయత్నం చేస్తే గల్లంతే..
- ఏటా ఇదే పరిస్థితి.. శాశ్వత పరిష్కారానికి దిక్కులేదు

జిల్లాలో ఏటా కురుస్తున్న భారీ వర్షాలతో కల్వర్టులు, తాత్కాలిక రహదారులు కొట్టుకు పోవడం.. కోతకు గురికావడం పరిపాటిగా మారింది. జోరు వానలతో వరద ఉధృతి ఎక్కువైన సమయంలో తాత్కాలిక పనుల తో చేతులు దులుపుకుంటున్న అధికార యంత్రాంగం.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో మట్టి రోడ్లు కొట్టుకుపోగా.. బీటీ రోడ్లు కోతకు గురయ్యాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. - జనగామ



మేకలగట్టు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు

వరద పెరిగితే రాకపోకలు నిలిచినట్టే..



వరద ప్రవాహంలోనూ కల్వర్టు దాటుకుని వస్తున్న ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్: కొత్తపల్లి, తాటికొండ, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి గ్రామాల మధ్య కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. వరద తాకిడి మరింత పెరిగితే రాకపోకలు నిలిచి పోయే ప్రమాదం ఉంది.

ప్రమాదకరం

బచ్చన్నపేట: కట్కూరు నుంచి బండనాగారం వెళ్లే మట్టి రోడ్డుపై గుంతలు పడ్డాయి. కొంత మేర కోతకు గురైంది. సైడ్‌బర్మ్‌లు కొట్టుకు పోయాయి. దీంతో ఈదారి నుంచి ప్రయాణం చేసే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. వర్షం కొనసాగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది.

రాకపోకలకు కష్టమే..

నర్మెట: వెల్దండలో చెరువు మత్తడి సమీపాన రోడ్డు కోతకు గురి కావడంతో అమ్మాపురం, పోతారం, అంకుషాపూర్, తరిగొప్పుల వైపు ప్రయాణం నరక ప్రాయంగా మారింది. వెల్దండ నుంచి నర్మెట వైపు రావాలన్నా ఇబ్బంది తప్పడం లేదు.

కుంట తూము లీకేజీ

పాలకుర్తిటౌన్: మల్లంపల్లి కాకాయకుంట తూము లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. వల్మిడి ఎర్ర చెరువు, గూడూరు ఊర చెరువు మత్తడి పోస్తున్నాయి.

కోతకు గురైన రోడ్డు



చిల్పూరు నుంచి పల్లగుట్ట, కొత్తపల్లికి వెళ్లే మార్గంలో కోతకు గురైన బీటీరోడ్డు

చిల్పూరు: పల్లగుట్ట నుంచి కొత్తపల్లి, పల్లెకు వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలను దారి మళ్లించారు. సుమారు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లింది.

ఏటా ఇదే పరిస్థితి..



తమ్మడపల్లి(ఐ) నుంచి ఉప్పుగల్లుకు వెళ్లే దారిలో కోతకు గురైన బీటీ రోడ్డు

జఫర్‌గఢ్: తమ్మడపల్లి(జి)(ఐ) గ్రామాల నుంచి పాలకుర్తి తదితర గ్రామాలకు వెళ్లే రహదారితో పాటు ఉప్పుగల్లు రోడ్డు కోతకుగురై ప్రమాదకరంగా మారింది. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా రెండు సార్లు కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు కోతకు గురికావడం, తూతూ మంత్రంగా పనులు చేయడంతోనే ఇలాంటి దుస్థితి నేలకొందని ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారి మళ్లింపు



నెల్లుట్ల వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

లింగాలఘణపురం: కుందారం–పాలకుర్తి రోడ్డులో పటేల్‌గూడెం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు నెల్లుట్ల వాగు ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో కుందారం, కిష్టగూడెం, చీటూరుతో పాటు పాలకుర్తికి వెళ్లే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నేలపోగుల, చిన్నమడూరు మీదుగా దారి మళ్లించారు.

30 ఎకరాల్లో వరి, పత్తికి నష్టం

దేవరుప్పుల: మూడు రోజులుగా కురిసిన వర్షంతో కోలుకొండ–గొల్లపల్లి వాగు ఉప్పొంగింది. కోలుకొండ–రామచంద్రాపురం రెవెన్యూ పరిధిలో జెర్రిపోతుల వాగు ఉధృతికి సుమారు 30 ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. పెద్ద ఒర్రె ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతం నుంచి వెళ్లకుండా అధికారులు కంపచెట్లు వేశారు. దీంతో రామచంద్రాపురం వాసులు శాతాపురం నుంచి కోలుకొండకు వస్తున్నారు. కడవెండి వాగులో గల్లంతైన 60 గొర్రెలను రైతులు అతికష్టమీద సురక్షితంగా బయలకు తీసుకువచ్చారు.



రామచంద్రాపురం జెర్రిపోతులవాగు వరదతో నీట మునిగిన వరి పంట

నర్మెట–మేకలగట్టు మధ్య..



ప్రమాదకరంగా మాదారం–దాసన్నగూడెం రోడ్డు

రఘునాథపల్లి: మేకలగట్టు వద్ద వాగుపై నూతన బ్రిడ్జి నిర్మిస్తున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో నర్మెటకు రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మాదారం వాగు ఉధృతికి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇబ్రహీంపూర్ పెద్ద చెరువు అలుగు పోస్తోంది. ప్రమాదకరంగా ఉన్న వరద నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఖిలాశాపూర్, మండలగూడెం, ఇబ్రహీంపూర్, కంచనపల్లి, కోడూరు, గబ్బెట, కన్నాయపల్లి, బాంజీపేట, మేకలగట్టు చెరువులు అలుగు పోస్తుండడంతో వరద పెరిగితే రాకపోకలు నిలిచిపోతాయి.

నిలిచిన రాకపోకలు



వరదకు కొట్టుకు పోయిన పోతారం–సోలీపురం రోడ్డు

తరిగొప్పుల: పోతారం–సోలిపురం గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన కల్వర్టు రోడ్డు కోతకు గురికావడంతో అధికారులు ముళ్లకంచె వేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటతండా శివారు సోమ్లాతండాలో రైతు గుగులోతు రవికుమార్‌కు చెందిన రెండెకరాల మొక్కజొన్న పంట నీటి పాలైయింది.



సోమ్లాతండాలో నేలవాలిన మొక్కజొన్నపంట

ప్రధాన రహదారి.. పట్టింపేది?

జనగామరూరల్: జనగామ–హుస్నాబాద్–నర్మెట ప్రధాన రహదారి గానుగుపహాడ్ జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ ప్రదేశంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు వాగు వరద ఉధృతికి రెండోసారి కొట్టుకు పోయింది. దీంతో గానుగుపహాడ్, వెంకిర్యాల, వెల్దండ గ్రామాల మీదుగా దారి మళ్లించారు.



జనగామ–హుస్నాబాద్ రూట్ గానుగుపహాడ్ వద్ద కొట్టుకు పోయిన తాత్కాలిక రోడ్డు

నిలిచిన రైళ్లు.. ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ

జనగామ: ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ సమీపాన వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకు పోవడంతో జనగామ మీదుగా నడిచే రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్సులకు రద్దీ పెరిగింది. హైదరాబాద్, హనుమకొండ తదితర రూట్లలో రెగ్యులర్‌గా రైళ్లలో ప్రయాణించే వారు.. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్నారు. దీంతో రద్దీ పెరిగి సీటుకోసం బస్సు ప్లాట్‌ఫాంపైకి రాకముందే.. కిటికీల నుంచి దూరుతూ సాహసం చేస్తున్నారు.

సీటు కోసం కిటికీ నుంచి బస్సులోకి దూరుతున్న ప్రయాణికుడు





జనగామ బస్టాండులో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు, కిటికీ నుంచి బస్సులోకి దూరుతున్న వ్యక్తి

జిల్లాలో రూ.2.50 కోట్ల నష్టం

- 278 ఎకరాల్లో వరి, పత్తి పంటలు, ఆరు చోట్ల రోడ్లు ధ్వంసం
- పాక్షికంగా కూలిపోయిన 12 ఇళ్లు
- రెండు ఇరిగేషన్ ట్యాంకులకు గండి
- విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులకు 7901628363, టోల్ ఫ్రీ–1912, 18004250028

జనగామ:జిల్లాలో రెండు రోజులు కురిసిన భారీ వర్షంతో వరి, పత్తి, ఇతర పంటలతో పాటు ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలకు భారీ నష్టం వాటిల్లింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యాన అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్ నేతృత్వంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జిల్లాలో వర్షాల కారణంగా 278 ఎకరాల్లో వరి, పత్తి పంటలు ధ్వంసమయ్యాయి. కొడకండ్ల, జఫర్‌గఢ్ మండలాల పరిధిలో 96 మంది రైతులకు చెందిన 120 ఎకారల్లో పత్తి, 158 ఎకరాల్లో వరి పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దేవరుప్పులలో 80 గొర్రెలు కొట్టుకు పోగా, 60 దొరికాయి. నర్మెట, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, పాలకుర్తి, లింగాలఘణపురం మండలాల పరిధిలో 12 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జనగామ, తరిగొప్పుల, లింగాలఘణపురం, జఫర్‌గఢ్, పాలకుర్తి పరిధిలో ఆరు చోట్ల రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు కోతకు గురికాగా నష్టం అంచనా వేసి సర్కారు నివేదించారు. ఇరిగేషన్ పరిధిలో రెండు ట్యాంకులకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులు, పిడుగు పాటు, వరద ఉధృతితో 22 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిని ఎన్పీడీసీఎల్‌కు రూ.2లక్షలకు పైగా నష్టం జరిగింది. ఎస్‌ఈ వేణుమాధవ్ పర్యవేక్షణలో నోడల్ ఆఫీసర్ సదర్‌లాల్ ఆధ్వర్యాన లైన్లు దెబ్బతిన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రిపేరు పనులు ముమ్మరం చేశారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యలకు సంబంధించి–7901628363, టోల్ ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని లేదా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

227 చోట్ల చెరువులకు మత్తడి

జనగామ: జిల్లాలో 769 చెరువులు, కుంటలు ఉండగా 49,643 ఎకరాల ఆయకట్టు ఉంది. 338 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీటి మట్టం పెరుగగా, 227 చోట్ల మత్తడి పోస్తున్నాయి. ఇదిలా ఉండగా చెరువులు, రిజర్వాయర్లలో అనుకున్న మేర నీటి నిల్వలు పెరగక పోవడంతో ఆందోళన నెలకొంది.

రిజర్వాయర్లలో నీటి మట్టం వివరాలు(మిలియన్ క్యూబిక్ మీటర్లలో)

రిజర్వాయర్	కెపాసిటీ	ప్రస్తుత నిల్వ	శాతం
గండిరామవరం	400.000	361.746	90 44
బొమ్మకూరు	198.000	129.600	65.45
చీటకోడూరు	300.258	155.659	51.84
నవాబుపేట	550.510	130.500	23.71
ఆర్ఎస్ ఘన్‌పూర్	1,570.000	1005.000	64.01
అశ్వరావుపల్లి	740.000	505.000	68.24

చెరువుల నీటిమట్టం వివరాలు

నీటి శాతం	చెరువులు
0–25	–
25–50	68
50–75	136
75–100	338
మత్తళ్లు	227

వడ్లకొండ రోడ్డు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనగామ నుంచి నర్మెట వెళ్లే దారిలో వడ్లకొండ వద్ద తెగిపోయిన రోడ్డు పునరుద్ధరణకు అధికారులు తక్షణమే పనులు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కొట్టుకుపోయిన రోడ్డును సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అనేక గ్రామాల ప్రజలు ఇదే మార్గం నుంచి ప్రయాణించాల్సి ఉందని, సత్వరమే రోడ్డును అందుబాటులోకి తెవాలన్నారు.

కల్వర్టు పరిశీలన

లింగాలఘణపురం: కుందారం–పాలకుర్తి రోడ్డు పటేల్‌గూడెం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో సోమవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ పరిశీలించారు. రోడ్డు మరమతు పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



గానుగుపహాడ్ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఇతర అధికారులు

190 ఎకరాల్లో పత్తి.. 120 ఎకరాల్లో వరి..

కొడకండ్ల : మండల పరిధిలో 190 ఎకరాల్లో పత్తి, 120 ఎకరాల్లో వరి పంట పాక్షింకంగా దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి తెలిపారు. పెద్ద వంగర శివారులో హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు వరద నీటికి కొట్టుపోగా కొడకండ్ల పెద్దవంగర మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్‌లు నిల్చిపోయాయి.



రంగాపురంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

వరద నీటితో పొలం మునిగింది



వానాకాలం సీజన్‌లో మూడు ఎకరాల్లో వరి నెల రోజుల క్రితం నాటు వేశాను. రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షంతో చెరువు పక్కనే పొలం ఉండటంతో అలుగు నీరంతా పొలం నుంచి వెళ్లి రెండు ఎకరాల పంట మునిగింది. రూ.50 వేలు పెట్టుబడి అయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఐతరాజు లక్ష్మీ, రంగాపురం

నీరు నిలిచి పత్తి చేను పాడైంది



పత్తి చేనులో నీరు నిల్చి పాడైంది. ఎకరం పది గుంటల్లో పత్తి సాగు చేయగా కాత దశలో వర్షం కురవగా గూడ రాలిపోయి చేను నెలకొరిగింది. చెట్టుకు 30 కాయలు కాశాయి. 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించాను. వానతో చేనంతా దెబ్బతింది. వర్షం ఇలాగే కొనసాగితే పంట చేతికి రాదు.

- గొడుగు అంతాలు, రైతు, రంగాపురం

వాగు వరద గండంగా మారింది



పాలకుర్తి మండలం కోతులబాద, ఈరవెన్ను ఏరియా నుంచి వచ్చే వరద ఉధృతి జెరిపోతుల వాగులోకి రావడంతో ఏటా పంటలకు గండంగా మారింది. ఈ వాగు వరదను పొలాల్లోకి రాకుండా పాలకులు చర్యలు చేపట్టకపోవడంతో నేటికీ సాగుచేసిన పంట వర్షాల పాలవుతోంది. రామసముద్రంలోకి నేరుగా వాగు వరద వెళ్లే ప్రాంతంలో అడ్డుగా పల్లెప్రగతి పనులు చేపడ్డంతో వరదలు పొలాల్లోకి మళ్లుతున్నాయి. ఈ ప్రాంతంలో పది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా.. నాది రెండు ఎకరాలు ఉంది.

- నాగులగాని సోమాజీ, రైతు, రామచంద్రాపురం(దేవరుప్పుల)



రామచంద్రాపురంలో పొలాల్లో ప్రవహిస్తున్న జెర్రిపోతుల వాగు వరద

21.13 కేజీల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్, ముగ్గురిపై కేసు నమోదు

రఘునాథపల్లి: అక్రమంగా తరలిస్తున్న రూ 5.25 లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఎస్సై నరేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం కొండదొరకు చెందిన పల్లిబోయిన శుభాకర్ ఎంబీఏ పూర్తి చేశాడు. సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న అతడికి వరుసకు బాబాయ్ అయిన జన్ని నాగేష్ ద్వారా ఒడిషా రాష్ట్రం సింధిపుట్‌కు చెందిన కాడ ధనుర్దాయ్‌తో పరిచయం ఏర్పడింది. వారి ద్వారా సికింద్రాబాద్, తిలక్‌నగర్‌కు చెందిన గాయత్రిబాయికి గంజాయి సప్లయ్ చేస్తున్నాడు. గత నెల 30న నాగేష్, దనుర్దాయ్ ఇచ్చిన గంజాయిని లోకమాన్య తిలక్ రైల్లో సికింద్రాబాద్‌కు తీసుకెళ్తున్నాడు. 31న వరంగల్ వద్ద పోలీసులు రైలులో చెక్‌చేస్తుండగా తప్పించుకున్నాడు. సోమవారం గంజాయి బ్యాగులతో రఘునాథపల్లి రేల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు రైలు లేక పోవడంతో బస్టాండ్‌కు వెళ్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా 21.13 కేజీల గంజాయి దొరికింది. శుభాకర్‌ను అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకొని నరేష్, దనుర్దాయ్, గాయత్రిబాయిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నిందితుడిని చూపుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

శాస్త్రీయ సమాజ స్థాపనే జేవీవీ లక్ష్యం..

జనగామ రూరల్: శాస్త్రీయ సమాజ స్థాపనే జేవీవీ లక్ష్యమని, ప్రజల్లో సైన్స్‌పై అవగాహన కల్పించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. సోమవారం జనగామ స్టేషన్‌రోడ్డులోని ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు మర్రిరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన జేవీవీ 5వ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎ.ఉమాదేవి, కోశాధికారిగా ఎం.లక్ష్మణ్‌జీ, ఉపాధ్యాక్షులుగా చంద్రశేఖర్ రావు, సత్యప్రకాష్, శోభన్‌బాబు, కార్యదర్శులుగా శోభన్‌రెడ్డి, శ్రావన్, సత్తయ్య, యాదగిరి, నీలకంఠ, కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా గోపాల్‌రెడ్డి, మనశ్విని, సాంబరాజు యాదగిరి, సభ్యులుగా శ్రీనివాస్ చారి, కనకయ్య, శ్రీనవాస్‌రావు, సరస్వతి, లలిత, రవీందర్ ఎన్నికయ్యారు.

'రాష్ట్రీయ పోషణ్ మాస్'ను విజయవంతం చేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 3 నుంచి చేపట్టే 'రాష్ట్రీయ పోషణ్ మాస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుంచి 30వ తేదీ వరకు ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలతల నివేదికను వారం రోజుల్లో అందజేయాలని చెప్పారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు చిన్నారుల ఇళ్లను సందర్శించి శానిటేషన్, తాగునీరు, చేతుల శుభ్రత, న్యూట్రీషియన్‌పై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించాలని, ఆరోగ్యలక్ష్మి కింద బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై వివరించాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీలో కిచెన్ గార్డెన్ల్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, డీఈఓ రాము, డీఐఓ స్వర్ణలత, డీపీఓ రామారావు, డీఎస్ఓ సరస్వతి, సీడీపీఓలు రమాదేవి, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మహానేతకు ఘన నివాళి

జనగామ: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, రాజన్న అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు.



- మరిన్ని చిత్రాలు 9లో▸


దోర్నకల్: ముల్కలపల్లి సమీపంలో పొలాల్లో ఇసుక మేటలు


మహబూబాబాద్: మున్నేరు సమీపంలో నేలవాలిన వరి పంట


ఖానాపురం: పాకాల పరిధిలో వరి పంటలో ఇసుక మేటలు


కురవి శివారులో మిరప తోటలో ఇసుక మేటలు


తాడ్వాయి- పస్రా మధ్య ధ్వంసమైన రోడ్డు

అల్లకల్లోలం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఈ వర్షం ధాటికి గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జల ప్రవాహంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా జనజీవనం స్తంభిస్తోంది. పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్


తాడ్వాయిలో కౌలు రైతు బంగారు నర్సమ్మ పొలంలో ఇసుక మేటలు


నర్సింహులపేట: కౌసల్యదేవిపల్లి ఆకేరు బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి సగానికి పైగా కోతకు గురైన రోడ్డు


నర్సింహులపేట మండలం రామన్న గూడెంలో ఇసుక మేటగా మారిన పొలాలు


మరిపెడ మండలం పురుషోత్తమయా గూడెం సమీపంలో ధ్వంసమైన 365 జాతీయ రహదారిని పెకిలిస్తున్న జేసీబీ


చిన్నగూడూరు: వరద ఉధృతికి ఆలయాల చుట్టూ తేలిన రాళ్లు


కాటారం: ఇబ్రహీంపల్లిలో కూలిన ఇల్లు


నెల్లికుదురు: వరదతో రావిరాల గ్రామంలో నేలమట్టమైన ఇల్లు


దోర్నకల్: ముల్కలపల్లి వద్ద ఆకేరు వరదలో కొట్టుకుపోయి తేలిన జేసీబీలు, ట్రాక్టర్లు

వరద జోరు.. గోదావరి హోరు


కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్‌ను తాకుతూ వెళ్తున్న గోదావరి


సమ్మక్క బరాజ్ వద్ద దిగువకు తరలుతున్న నీరు

- కాళేశ్వరం వద్ద 11.110 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- అన్నారం బరాజ్‌కు 6.87 లక్షలు, మేడిగడ్డకు 8.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద జోరు పెరుగుతోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో దిగువన గోదావరికి వరద నీరు చేరుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి) బరాజ్‌కు భారీగా వరద రాగా, దీనికితోడు పెద్ద వాగుకు వరద పోటెత్తడంతో 6.87 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. బరాజ్‌లోని మొత్తం 66గేట్లు ఎత్తడంతో ఆ వరద నీరంతా దిగవన కాళేశ్వరం వైపునకు పరుగులు తీస్తోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. రెండు నదులు కలిసి కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 11.110 మీటర్ల ఎత్తులో వరద నీరు దిగువకు తరలుతోంది. దీంతో మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్దకు 8.35 లక్షల క్యూసెక్కుల వరద తరలి రాగా, బరాజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు తరలిస్తున్నారు.

గోదావరి ప్రాంతాల్లో పంట నీటమునక..

భారీ వర్షాల కారణంగా మహదేవపూర్ మండలంలో పత్తి, వరి, మిర్చిపంట నీటమునిగింది. దీనితోడు గోదావరికి వరద ఉప్పొంగడంతో వరదనీరు పరీవాహక ప్రాంతాల్లోని పంటల్లోకి చేరింది. దీంతో ఆయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాళేశ్వరం, పూస్కుపల్లి, బెగులూర్‌లోని కొంగలవాగు ఉధృతంగా ప్రవహించి పంట చేనుల్లోకి నీరు చేరింది. దీంతో పంట నీటముగినట్లు రైతులు పేర్కొంటున్నారు. కానీ వ్యవసాయశాఖ అధికారులు మాత్రం అటు వైపు రాలేదని పేర్కొన్నారు. అధికారులు పంట నష్టం సర్వేచేయాలని కోరుతున్నారు. మహదేవపూర్ మండలంలో ప్రాథమికంగా సుమారు 100 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

సమ్మక్క సాగర్ 59 గేట్లు ఎత్తివేత..

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ నుంచి సోమవారం 3లక్షల 84వేల 210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి సాయిరాం తెలిపారు. మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బరాజ్ వద్దకు వరద నీరు పోటెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు బరాజ్‌వద్ద ఉన్న ఉన్న 59 గేట్లు ఎత్తివేశారు. కాగా, వరద మరింత వస్తుందని అంచనా వేసిన అధికారులు గేట్లు ఎత్తి ఉంచడంతో వచ్చిన వరద వచ్చినట్లు కిందకు వెళ్తోంది. ప్రస్తుతం బరాజ్ వద్ద నీటి మట్టం 76.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దేవాదుల వద్ద ఉన్న మోటార్లను నిలిపివేశారు. దేవాదులకు కూడా బ్యాక్ వాటర్ వచ్చి చేరుతోంది.

రైళ్ల రద్దు కొనసాగింపు..

- కాజీపేట మీదుగా వెళ్లే 14 రైళ్ల రద్దు
- పలు ట్రైన్లు దారి మళ్లింపు

కాజీపేట రూరల్ : మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్ ట్రాక్ ఘటనతో సోమవారం రెండో రోజు కూడా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రూట్లలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

సోమవారం కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, ఈ నెల 5వ తేదీన డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పార్శిల్లీ రద్దు

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు భద్రాచలంరోడ్-సిర్పూర్ టౌన్ (17033) ప్యాసింజర్ భద్రాచలం-కాజీపేట మధ్య రద్దు, ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు సిర్పూర్ టౌన్-భద్రాచలంరోడ్(17034) ప్యాసింజర్‌ను కాజీపేట-భద్రాచలం రోడ్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట జంక్షన్, నాగపూర్, నడికుడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను సోమవారం రైల్వే అధికారులు దారి మళ్లించి నడిపించారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సోమవారం సికింద్రాబాద్-విశాఖపట్నం(22204) ఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్-నాందేడ్ (17409) ఎక్స్‌ప్రెస్, నాందేడ్-ఆదిలాబాద్ (17410) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 3న సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్(17234), సికింద్రాబాద్-విశాఖపట్నం (20834) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20708) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-షాలిమార్(12774) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4న షాలిమార్-సికింద్రాబాద్ (12773) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నాలుగు గంటలు.. నరకయాతన

- రాళ్లవాగులో కొట్టుకుపోయిన డీసీఎం
- నలుగురిని కాపాడిన పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు


రాళ్లవాగు వరద ఉధృతి నుంచి బయట పడింది వీరే..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో ఆదివారం రాత్రి డీసీఎం కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, ఈ వాహనంలో ఉన్న ఐదుగురిలో ఒకరు గల్లంతుకాగా నలుగురు సురక్షితంగా బయటకు వచ్చారు. వారంతా నాలుగు గంటల పాటు వరద నీటి ఉధృతిలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నరకయాతన అనుభవించారు. సంగారెడ్డి జిల్లా మాచునూర్‌కు చెందిన డ్రైవర్ నులక ప్రవీణ్ కుమార్.. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌కు డీసీఎంలో సరుకులు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈదులపూసపల్లి రాళ్ల వాగు వద్ద వరద ఉధృతి ఎక్కువ ఉందని గ్రామస్తులు తెలుపగా వాహనం అక్కడే నిలిపి ఉంచాడు. కేసముద్రంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోగా అందులో ప్రయాణించిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన టికీ సునీల్‌కుమార్, అదే మండలం కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం, గుంటూరులోని శ్రీనగర్ కాలనీకి చెందిన వేణుకోటయ్య ప్రైవేట్ వాహనాల ద్వారా ఈదులపూసపల్లికి వచ్చారు. కేసముద్రం గ్రామానికి వెళ్లిన మహబూబాబాద్ పట్టణంలోని మంద కొమురమ్మనగర్‌కు చెందిన దుస్సా దుర్గాప్రసాద్ కూడా ఈదులపూసపల్లికి చేరుకున్నాడు. ఈ నలుగురుతో పాటు డీసీఎం డ్రైవర్ అంతా కలిసి అదే వాహనంలో మహబూబాబాద్‌కు వద్దామని నిర్ణయించుకోగా వరద ఉధృతి తగ్గకపోవడంతో రెండు గంటల పాటు రాళ్లవాగు వద్దే వేచి ఉన్నారు. ఆ సమయంలో గ్రామస్తులు అక్కడే ఉండమని చెప్పారు. కొంత సమయం అక్కడే వేచి ఉండి అనంతరం ప్రయాణం మొదలుపెట్టారు. డీసీఎం కొంతదూరం వచ్చాక వాగు ఉధృతిలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న వ్యక్తుల అరుపులు విన్న స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ తిరుపతిరావు, టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక, తహసీల్దార్ భగవాన్ రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. టార్చ్‌లైట్ల వెలుతురుతో పరిశీలించగా కొందరు చెట్టుకొమ్మలను పట్టుకుని ఉన్నట్లు, కొందరు వాహనంలో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేకంగా జేసీబీ తెప్పించి డీసీఎంలో ఉన్న వ్యక్తుల వద్దకు వైర్లు, రబ్బరు టైర్లు, ట్యూబ్‌లు వదిలారు. మొదట నాగభూషణం ఆ ట్యూబ్ సాయంతో ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేయగా కొంత దూరం వచ్చి వరద ఉధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అంతలోనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించగా వారు నాటు పడవతో వరదనీటిలోకి దిగి గంటల కొద్ది కష్టపడి మిగతా నలుగురిని అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో బయటకు తీసుకువచ్చారు. కాగా జరిగిన ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ డీసీఎం డ్రైవర్ నులక ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి నీరు


కేసముద్రం స్టేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

కేసముద్రం: కేసముద్రం- ఇంటికన్నె- తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో సుమారు 26 చోట్ల రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. అమీనాపురం చెరువు మత్తడి పోస్తోంది. ఆ నీరంతా కేసముద్రం స్టేషన్‌లోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కల్వర్టు పైవరకు వరదనీరు తాకింది. ఇదే మాదిరి వర్షం ఎక్కువైతే ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ విధంగా ఇంటికన్నె, కేసముద్రం మధ్య, తాళ్లపూసపల్లి, కేసముద్రం మధ్యలోని కల్వర్టుల వద్ద వరద ఉధృతి పెరిగితే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ట్రాక్ కింద నిలిచిన నీరు



గార్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గండిచెరువు పక్కన ఉన్న రైల్వేట్రాక్ భారీవర్షాలు కురిస్తే వరద ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. 10 ఏళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పోస్తుండడంతో గండిచెరువు పక్కన డబ్బాల మోరీ వద్ద రైల్వేట్రాక్ కింద మట్టి, కంకర కొట్టుకుపోయి రైల్వేపట్టాలు నీళ్లలో తేలాయి. దీంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రాంతంలో రైల్వేట్రాక్ కింద రాళ్లతో నిర్మాణం చేపట్టి వరదనీరు వెళ్లేందుకు మోరీలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిస్తే వరదనీరు రైల్వే పట్టాల పైనుంచి వెళ్లే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గండి చెరువు నిండి 2 నెలల పాటు రైల్వేట్రాక్ కింద 5 ఫీట్ల నీళ్లు నిలిచి ఉంటాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

డేంజర్.. డేంజర్

వరద నీటితో రైల్వే ట్రాక్‌లకు పొంచి ఉన్న ప్రమాదం


అయ్యప్పటెంపుల్ ఏరియాలో రైల్వేట్రాక్ పక్కన నిలిచిన వరద నీరు


జనగామ: 384 నంబర్ కల్వర్టు వద్ద పిచ్చి మొక్కలతో నిండిన బ్రిడ్జి

జనగామలో రైల్వే ట్రాక్ పక్కనే వరద..

- ఒకే చోట రోజుల తరబడి నీటి నిల్వ

జనగామ: జిల్లా పరిధిలోని రైల్వే ట్రాక్‌కు పెద్ద ప్రమాదం లేకున్నా.. చిన్న చిన్న లోపాలపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ కొట్టుకు పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' జిల్లా పరిధి రైల్వేట్రాక్ ప్రస్తుత పరిస్థితులపై విజిట్ చేసింది. చిన్న చిన్న లోపాలు ఉన్నట్లు గుర్తించింది. జనగామ మండలం పెంబర్తి నుంచి చిల్పూరు మండలం చిన్న పెండ్యాల వరకు జిల్లా పరిధిలో 45 కిలో మీటర్ల మేర రైల్వేట్రాక్ విస్తరించి ఉంది. పెంబర్తి నుంచి జనగామ వరకు 5 కిలోమీటర్ల దూరం. జనగామ నుంచి యశ్వంతాపూర్-6, యశ్వంతాపూర్ నుంచి రఘునాథపల్లి-6, రఘునాథపల్లి నుంచి ఇప్పగూడెం-9, ఇప్పగూడెం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్-7, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నష్కల్-7, నష్కల్ నుంచి చిన్న పెండ్యాల-5 కిలోమీటర్లు ఉంటుంది. జనగామ పట్టణం బాణాపురం సమీపాన 384 కల్వర్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద పిచ్చి మొక్కల కారణంగా రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉంటోంది. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లలేని సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. అలాగే, బాణాపురం అయ్యప్ప టెంపుల్ ఎదుట కట్టపక్కన అర కిలోమీటరు మేర నిలిచిన వరద నీరు కుంటను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఎటూ వెళ్లలేక ట్రాక్ కట్టకు ఆనుకుని నిలిచిపోయి.. అందులోనే ఇంకిపోతోంది. పట్టణంలోని పాత బీటు బజారు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్వహణ అధ్వానంగా మారింది. బ్రిడ్జికి మొత్తం ఆరు అండర్ నాలాలు ఉండగా.. పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి నీరు రోజుల తరబడి నిలుస్తోంది. వరద ఉధృతి పెరిగిన సమయంలో ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్పూరు, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైల్వేట్రాక్‌కు ఎలాంటి ప్రమాదం లేదు. ఇప్పగూడెం వద్ద ఈ నెల 1న మధ్యాహ్నం పట్టాలపైకి వచ్చిన కొద్దిపాటి వరద నీరు సాయంత్రానికి తగ్గు ముఖం పట్టింది. రైల్వేట్రాక్ ఎగువ ప్రాంతంలో ఉండడంతో నష్టం జరిగే అవకాశం లేదు.

చెరువులతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ట్రాక్‌కు ప్రమాదం

- అప్రమత్తమైన రైల్వే అధికారులు
- రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం


నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్ సమీపానికి చేరిన వరదతో స్తంభించిన రాకపోకలు

కాజీపేట రూరల్: మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి-ఇంటికన్నె రైల్వే ట్రాక్ ఘటనతో సోమవారం రైల్వే అధికార యంత్రాగం అప్రమత్తమైంది. రైల్వే ట్రాక్ వద్ద గస్తీ మరింత ముమ్మరం చేసి, సమీప చెరువుల వద్ద ప్రమాదాలపై జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గొలుసుకట్టు చెరువులతో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆయా చెరువులు నిండాయి. మరో రెండు రోజులు ఇలాగే కురిస్తే గొలుసు కట్టు చెరువులు తెగి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తమై ఇసుక, కంకర, మట్టి బస్తాలు, మెటీరియల్, సిబ్బందిని అన్ని విధాలా అప్రమత్తం చేసినట్లు వారు తెలిపారు.

ట్రాక్ గస్తీ ముమ్మరం

వడ్డేపల్లి చెరువు వద్ద రైల్వే ట్రాక్ వద్ద వరద నీటి మట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండి పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేశారు. పెండ్యాల, రాజారం చెరువుతో నష్కల్ రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నష్కల్ వద్ద రైల్వే గేట్ నంబర్ 53 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరి నష్కల్, వంగాలపల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వంగాలపల్లి రైల్వే సర్వీస్ గేట్ నంబర్ 54లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఘన్‌పూర్ సమీపంలో ఇప్పగూడ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరింది.

గతంలో జరిగిన రైలు ఘటనలు

1954 సెప్టెంబర్ 27న యశ్వంతాపూర్ వాగులో వరద నీటిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ 4 బోగీలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 300 మంది మృతి చెందారు. ఈ ఘటనపై నాటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రీ రాజీనామా చేశారు. 1987 జూలై 9న మంచిర్యాల వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ వరద నీటిలో 14 కోచ్‌లు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 53 మంది మృతి చెందారు. 2005 అక్టోబర్ 29న నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ వరదలో కొట్టుకుపోయిన ఘటనలో 114 మంది మృతి చెందారు. 200 మందికి గాయాలయ్యాయి.